# దామరచర్ల మండల సమస్యలు పరిష్కరించాలని సిపిఐ ధర్నా



**మిర్యాలగూడ నవభూమి, జూలై 1:-** దామచర్ల మండల సమస్యలు పరిష్కరించాలని సిపిఐ ఆధ్వర్యంలో దామరచర్ల తహసీల్దార్ జవహర్ కు మెమోరండం మంగళవారం అందజేసారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు దామరచర్ల మండల సిపిఐ కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి ధీరావత లింగానాయక్, మండల సహాయ కార్యదర్శి ధనావత్ శాంతి మండల కమిటీ సభ్యులు జమ్మల కోటయ్య, పేరుపొంగు లక్ష్మయ్య, పోలేపల్లి సులేమాన్, వి.సైదా తహసీల్దార్ జవహర్లాల్ కు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దామరచర్ల మండలంలో తాతల తండ్రుల దగ్గర నుండి కబ్జాలో ఉంటూ భూమి సేద్యం చేసుకున్న రైతులకు ప్రభుత్వం తలపెట్టిన భూభారతిలో దరఖాస్తు తీసుకున్న ప్రతి రైతుకు బేషరతుగా వారికి పట్టేదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని సిపిఐ విజ్ఞప్తి చేస్తా ఉందని వారన్నారు. దామరచర్ల మండలంలో అనేకమంది అసైన్ భూములు డి ఫారెస్ట్ భూములు, ఫారెస్ట్ భూములు, దేవాదాయ శాఖ భూములను కొంతమంది ఆక్రమించుకొని ఆ భూమిలో వచ్చే ఫలాలను అనుభవిస్తున్నారని వారన్నారు అలాంటి వారిని ప్రభుత్వ అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలన చేసి ఆక్రమించుకున్న భూములను ప్రభుత్వం స్వాధీన పరుచుకుని భూమి లేని నిరుపేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రభుత్వ వైపు నుంచి రెండుసార్లు సర్వే చేసి ఆ రైతులకు నేటికీ పాసు పుస్తకాలు ఇవ్వలేదని అలా కాకుండా వెంటనే పరిశీలన చేయగానే రైతుకు పాస్ పుస్తకాలు అందే విధంగా చూడాలని డిమాండ్ చేశారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**గరిడేపల్లి నవభూమి:** గరిడేపల్లి మండల పరిధిలో ఉన్న గారకుంట తండా గ్రామానికి చెందిన గుగులోతు సంధ్య భర్త బాబు 40,000 బానోతు బుల్లి భర్త సైదా 31000 బానోతు జిమ్రి భర్త డాక్య 24000 స్థానిక హుజూర్నగర్ శాసనసభ్యులు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రివర్యులు ఉత్తంకుమార్ రెడ్డి సహకారంతో ముంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను ఈరోజు మండల కేంద్రంలో లబ్ధిదారులకు అందజేశారు మండల పార్టీ అధ్యక్షులు త్రిపుర అంజన్ రెడ్డి మాజీ జెడ్పిటిసి పెండెం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సీఎం సహాయనిది వరం లాంటిదని ప్రతి ఒక్కరూ సీఎం సహాయనిధిని వినియోగించుకోవాలని వారు కోరారు మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోతు రమేష్ నాయక్ ప్రత్యేక చొరవతో సీఎం సహాయనిధి చెక్కులు మంజూరయ్యాయని వారు అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పైడిమర్రి రంగనాథ్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పెండెం ముత్యాలు గౌడ్ సురభి సైదులు గిరిజన నాయకులు బానోతు రమేష్ నాయక్ సుధాకర్ నాయక్ జలంధర్ నాయక్ ఫుల్ సింగ్ నాయక్ వీరేందర్ సంతోష్ మోహన్ లబ్ధిదారుల కుటుంబ సభ్యులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులకు క్రీడా సామాగ్రి దుస్తుల పంపిణీ



**గరిడేపల్లి నవభూమి:** గరిడేపల్లి మండలంలోని పరేరెడ్డిగూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఆశ్రీ సొసైటీ ఆధ్వర్యంలో 30 మంది విద్యార్థులకు 19 వేల విలువగల క్రీడా సామాగ్రి దుస్తులు నోట్ బుక్స్ పెన్స్ పంపిణీ చేశారు. దాతలు కందుల పూర్ణి రామ్ కిషోర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగకరమైన వస్తువులను అందజేయడం చాలా సంతోషంగా ఉందని. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు తమ సంస్థ తరఫున నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా వైద్యుల దినోత్సవం



**గరిడేపల్లి నవభూమి:** గరిడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్స్ డే సందర్భంగా సిబ్బంది అందరూ డాక్టర్ వి నరేష్, ఆయుర్వేదిక్ డాక్టర్ అనిత గార్లను శాలువా,పూలమాలల తో ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనమందరం ప్రజలకు అందుబాటులో ఉండే వారికి ఆరోగ్య సేవలు అందించాలన్నారు. అంకిత భావంతో సేవలు నిర్వర్తించాలన్నారు. అప్పుడే మనకు సరైన గుర్తింపు లభిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో పి. హెచ్.ఎన్ శారద,సూపర్వైజర్ స్. అంజయ్య గౌడ్, వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ కలీం ఎం ఎల్ హెచ్ పి లు,అశోక్,సాయి,స్టాఫ్ నర్స్ యశోద, ఎల్ టి ఉపేందర్ ఫార్మసిస్ట్ కృష్ణ,హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్,ఎ ఎన్ ఎం లు సరస్వతి, కవిత, అరుణ,అంజలి,సైదమ్మ రాజకుమారి, విజయ,రేణుక,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగంలో దళారి వ్యవస్థను నిర్మూలించాలి

**రామకృష్ణాపూర్-నవభూమి** వ్యవసాయ రంగంలో దళారి వ్యవస్థను నిర్మూలించాలని సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ అధ్యక్షులు న్యాయవాది రాజలింగు మోతే అన్నారు. మంగళవారం ప్రపంచ వ్యవసాయ దినోత్సవ సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాలు సరిగా లేకపోవడంతో అన్నదాతలు, ముఖ్యంగా సన్నకారు రైతులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులు కొనుగోలు దారుల నడుమ దళారీ వ్యవస్థను నిర్మూలించనంతకాలం ప్రయోజనం ఉందని అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు ఆహార భద్రతను కలిగించినా, రైతులకు మాత్రం ఆదాయ భద్రతను ప్రభుత్వాలు ఇవ్వలేక పోతున్నాయని అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు అవసరమైన సరుకులను రైతుల నుంచి ప్రభుత్వం కనీస మద్దతు ధరలతో కొనుగోలు చేయాలని, అవసరమైతే ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రత్యేక యంత్రాంగంగా నెలకొల్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కుమ్మం సురేందర్, కలువల సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



### హక్కుల సాధన కోసం

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

◆ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రంగారెడ్డి



**మిర్యాలగూడ నవభూమి, :-** కార్మికుల సంక్షేమం కోసం ఈ నెల 9న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. మంగళవారం స్థానిక మార్కండేయ ఫంక్షన్ హాల్లో సీఐటియు నియోజకవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సమస్యలను మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అందరి కంటే ఎక్కువ కష్టపడి పని చేసే వారినీ ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. వస్తువు ఉత్పత్తికి మూలమైన పేద కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమాన్ని, చట్టాలను రద్దు చేసేందుకు కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా 4 లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికుల వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. 11 ఏళ్లుగా వస్తువులపై ధరల బాదుడుపై ధ్వజమెత్తారు. కొత్త చట్టాలు వలన కార్మికులకు కనీస వేతనం అందదని, శ్రమకు తగ్గ వేతనం లేదని, కార్మికుల శ్రమ దోపిడీకి గురవుతారని చెప్పారు. కనీసం హక్కుల కోసం పోరాడే స్వేచ ఉందన్నారు. పారిశ్రామిక వాదులకు, కార్పొరేట్లకు అనుకూలంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తూ పేదలను విస్మరిస్తున్నారని ఆరోపించారు . ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యం ఉచితంగా అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల కోసం పని చేయాలని, పేదల సంక్షేమ%శీ% కోసం కృషి చేయాలన్నారు. 5న అన్ని మండల కేంద్రాల్లో మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించాలని, 9 వరకు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలపాలని కోరారు. పాలకులు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ఉద్యమాల ద్వారా తిప్పికొట్టాలని కోరారు. 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ రాస్తున్న కౌన్సిల్ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రామ్మూర్తి, టూ టౌన్ కార్యదర్శి భావండ్ల పాండు, సిపిఎం మండల కార్యదర్శి రవి నాయక్, సీఐటీయూ నాయకులు రొండి శ్రీనివాస్, దయానంద్, కేశవులు, బొందు పార్వతి, సైదులు, మహేశ్వరి పాల్గొన్నారు.

### ప్రజల పక్షాన ఉండి

# పోరాడే నైజం ఎర్రజెండా





**గరిడేపల్లి నవభూమి:** ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలిచేది ఎర్రజెండా ఒకటేనని మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి పేర్కొన్నారు. హుజూర్నగర్ నియోజకవర్గంలోని చింతలపాలెం మేళ్లచెరువు గరిడేపల్లి హుజూర్నగర్ మండలాల కమ్యూనిస్టు పార్టీ నాయకులు కార్యకర్తలకు ఒకరోజు రాజకీయ శిక్షణ తరగతులను మంగళవారం గరిడేపల్లి లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. అధికారం చేపట్టే పాలకులు ఎవరైనా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తే ప్రజల పక్షాన ఉండి పోరాడే నైజం ఎర్రజెండాకే ఉందని తెలిపారు. సమస్యలపై స్పందించి ప్రజా పోరాటాలు ఉద్యమాలు నిర్వహించేది ఎర్రజెండా మాత్రమేనని ప్రజలందరికీ తెలుసని ఆయన తెలిపారు. నేడు ప్రపంచంలో యుద్ధ వాతావరణం నెలకొందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాల్లో కొన్ని సంపన్న దేశాలు తమ ఆధిపత్యం కోసం చేస్తున్న ప్రయత్నాలే యుద్ధ మేఘాలు తలెత్తడానికి కారణం అవుతున్నాయని అన్నారు. దీనిలో భాగంగానే రష్యా, ఉక్రేయన్, ఇజ్రాయిల్ ఇరాన్, భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య యుద్ధాలు జరిగిన సంగతి అందరికీ తెలిసిందే అన్నారు. ఈ ఆధిపత్య పోరులో వేలాదిమంది ప్రజలు ప్రాణాలు పోగొట్టుకున్నారని, దీంతోపాటు ప్రజల సంపద ధ్వంసం అవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని దేశాలు అవలంబిస్తున్న తీరుతో నేడు ప్రపంచవ్యాప్తంగా అశాంతి అలజడులు ఆందోళనలతో అట్టుడికి పోతుందని తెలిపారు. ఈ పరిణామాలన్నీ ప్రపంచశాంతికి భగ్నం కలిగించేవని, వీటిని అధిగమించేందుకు ప్రపంచ దేశాలన్నీ ఆలోచించాల్సిందిగా ఆయన సూచించారు. పాలకులు ప్రజల అవసరాలను తీర్చకుండా అధికార దాహంతో ముందుకెళ్లడం సరే అయింది కాదన్నారు. ప్రజల సమస్యలను పక్కకు పెట్టి, కేవలం కార్పొరేట్ శక్తులకు దాసోహం అయ్యి దానిని దేశాభివృద్ధి చెందిందని చెప్పటం సిగ్గుచేటు అన్నారు. కేంద్రంలో 10 సంవత్సరాల మోడీ పాలనలో సాధించిందేమీ లేదని విమర్శించారు. ప్రజల సంపదలను పన్నుల రూపంలో పాలకులు కార్పొరేట్ శక్తులకు అందచేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వాలు మారుతున్న పేద ప్రజలకు మాత్రం న్యాయం జరగటం లేదన్నారు. విపరీతంగా పెరిగిన ధరలు, ప్రజలపై మోపుతున్న పన్నుల భారాలు తప్ప పేద ప్రజలను బాగు చేసిన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదన్నారు. ఎర్రజెండా అధికారంలో ఉన్న దేశాల్లో మాత్రం ప్రజల అవసరాలను తీరుస్తూ దేశాభివృద్ధి కోసం ముందుకెళ్తున్న తీరు ఈరోజు అన్ని దేశాలు ఎర్రజెండా వైపు చూసే విధంగా పరిస్థితి తయారయింది అన్నారు. ఎన్నో ఏళ్లగా పోరాటాలు చేసి ఎర్రజెండా ఆధ్వర్యంలో కార్మిక చట్టాలను తీసుకువస్తే నేడు కేంద్ర రాష్ట్ర పాలకుల తీరుతో ఆ చట్టాలను కనుమరుగు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రైతు వ్యతిరేక విధానాలు కార్మిక వ్యతిరేక విధానాలు ప్రజా వ్యతిరేక విధానాలతో దేశ రాష్ట్ర ప్రజల పరిస్థితి ఆగమ్య గోచరంగా తయారైందన్నారు. మోడీ పాలనలో రైతు వ్యతిరేక చట్టాలను తీసుకురాగా దానిపై జరిగిన రైతు ఉద్యమంలో 900 మంది రైతులు ప్రాణాలు పోగొట్టుకున్నారని దీంతో వెనక్కు తగ్గి రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకున్నదని ఆయన గుర్తు చేశారు. నేడు కమ్యూనిస్టు పార్టీ ఎక్కడ ఉంది అని ప్రశ్నించే వారికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని కార్యకర్తలు సమాధానం చెప్పాలని ఆయన కోరారు. పాలకులు అవలంబిస్తున్న తీరుపై ప్రపంచ కార్మికులంతా ఏకం కావాలని దోపిడీ, అన్యాయాలపై గొంతు ఎత్తాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలనలో రైతులకు, పేద ప్రజలకు, కార్మిక వర్గాలకు ఒరిగిందేమీ లేదని ఆయన ఎద్దేవా చేశారు. పాలకులు ఇప్పటికైనా వారి తీరు మార్చుకోకుంటే ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల పక్షాన ఎర్రజెండా నిలబడి ఉద్యమాలు చేసేందుకు సిద్ధంగా ఉందని ఆయన హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా త్వరలో స్థానిక సంస్థలు ఎన్నికలు జరగనున్నాయని, వాటిని దృష్టిలో పెట్టుకుని కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు నాయకులు అత్యధిక స్థానాలు సాధించేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చటంలో పూర్తిగా విఫలమైందనే విషయాన్ని వచ్చి ఎన్నికల్లో ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజల పక్షాన నిలబడి స్థానిక నాయకులంతా అధికారులను ఎక్కడికక్కడ నిలదీయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని ఆయన కోరారు. ఎర్రజెండా పార్టీలో పనిచేస్తున్నందుకు ప్రతి కార్యకర్త గర్వంగా నిలిచే విధంగా ప్రజల పక్షాన పోరాడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు నిమ్మ ది వెంకటేశ్వర్లు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నగరపు పాండు ములకలపల్లి రాములు జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకట్ రెడ్డి ఎస్ కే యాకూబ్ బ్రహ్మం సైదులు మండల కమిటీ సభ్యులు తుమ్మల సైదయ్య యానాల సోమయ్య బోయిళ్ల అర్జున్ దోసపాటి బిక్షం బి. శ్రీనివాస్ నందిపాటి మట్టయ్య సుధాకర్ అంబటి బిక్షం మండవ సైదులు వెంకటేశ్వర్లు శీను రాచముల రామస్వామి వెంకయ్య శీను వీర రాఘవయ్య వీరస్వామి వివిధ మండల కార్యదర్శులు గ్రామ శాఖలు నాయకులు తదిరులు పాల్గొన్నారు

# సమాజహితం కోరేవారు వైద్యులు

**జనగామ నవభూమి ప్రతినిధి జులై(01)** సమాజహితం కోరేవారు వైద్యులని వారిని గౌరవించడం ధర్మమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం డాక్టర్స్ డే పురస్కరించుకొని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జనగామ బ్రాంచ్ ఆధ్వర్యంలో డాక్టర్ బాలాజీ అధ్యక్షతన నిర్వహించిన రక్తదాన శిబిరంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. త్యాగానికి ప్రతీకలని రక్తదానశిబిరంఏర్పాటు చేసిన ఐఎంఏ, కెమిస్ట్స్ లను అభినందించారు. ప్రభుత్వ పథకాలు అమలు చేయడంలో ఐఎమ్ఎ సహకరించాలనికోరారు. రక్తదాతలకు కలెక్టర్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. తొలుతస్వాగతం తెలిపిన సీనియర్ డాక్టర్ డి. లవ కుమార్ రెడ్డి, డాక్టర్ బి సి రాయ్ గురించి ప్రస్తావిస్తూ డాక్టర్స్ డే విశిష్టతను గురించి వివరించారు. జిల్లావైద్యాధికారి డా. మల్లికార్జున్ రావు మాట్లాడుతూ,ఐఎంఏ వైద్యుల సహనశీలత సౌజన్య గుణాలను అభినందించారు. ప్రభుత్వ కార్యక్రమాలను సఫలం చేయడంలో వైద్యులు సహకారం అందించాలని కోరారు. ఈసంద ర్భంగా శిబిరంలో 56 మంది రక్తదానం చేసినట్లు రక్త నిధి వైద్యాధికారి డా పి. కరుణాకర్ రాజుతెలిపారు. ప్రభుత్వవైద్యశాల చీఫ్ పాథాలజిస్ట్ డా అన్వర్, డా. ఏ. శ్రీనివాస్, పుర ప్రముఖులు కన్న పరశురాములు, డా. కల్నల్ మాచర్ల బిక్షపతి,క్రిష్ణజీవన్ బజాజ్ కెమిస్ట్స్ అసోసియేషన్ దేవరాజ్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలోడా,సీహెచ్.రాజ మౌళి, కెమిస్ట్స్ కార్యదర్శి క్రిష్ణ, దోర్నాల.వెంకటేశ్వర్లు,డా,కనక రాజు,డా.వెంకటాచలం, డా.ప్రదీప్,డా.సృజన్,డా,స్వప్నారాథోడ్,డా,రజినీ,డా.మౌనిక,డా, అనూష ,డా.ప్రీతీదయాళ్,డా,స్వప్న ఐఎంఏ కార్యదర్శి డా,ఏ.శ్రీకాంత్ పాల్గొన్నారు.







# నాగార్జునసాగర్ ఆయకట్టుకు నీటి విడుదల తేదీలను వెంటనే ప్రకటించండి


**పోకల వెంకటేశ్వర్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు**



**గరిడేపల్లి నవభూమి:** వానాకాలం సీజన్ ప్రారంభమై రైతులు ముమ్మరంగా వ్యవసాయ పనులు చేసుకుంటున్నందున సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల తేదీలను వెంటనే ప్రకటించి ప్రభుత్వం రైతులకు అండగా నిలబడాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభుత్వాన్నిపోయారు. గరిడేపల్లి మండల కేంద్రంలో జరిగిన సిపిఐ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కృష్ణా నది పరివాహ ప్రాంతంలో భారీగా వర్షాలు పడుతూ దూరాల ప్రాజెక్టు కూడా నిండి శ్రీశైలం ప్రాజెక్టు నిండటానికి దగ్గరలో ఉన్నందున, సాగు నీటికి ఇక ఏ మాత్రం ఇబ్బంది ఉండదని అర్థం అవుతున్నందున, ప్రభుత్వ పెద్దలు సాగర్ ఆయకట్టుపై ద్రుష్టి పెట్టి వెంటనే నీటి విడుదల తేదీలను ప్రకటించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ వానాకాలం సీజన్లో రైతులకు ఎరువుల కొరత రాకుండా చూడటానికి ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా యూరియా కొరత రాకుండా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య ఏఐటీయూసీ జిల్లా నాయకులు త్రిపురం సుధాకర్ రెడ్డి,సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు ఎడ్ల అంజిరెడ్డి, కుందూరు వెంకటరెడ్డి, మామిడి శ్రీను, చేవా వెంకన్న తదితరులు పాల్గొన్నారు

## చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం

**జిల్లా చేనేత, జోళి సహాయ సంచాలకులు శ్రీనివాస్**





**భూదాన్ పోచంపల్లి నవభూమి ప్రతినిధి జులై 01:** పురపాలక కేంద్రంలో చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో విషయాన్ని తెలుసుకున్న ఏడి, నేత కార్మికులు చేనేత నాయకులతో కలిసి సమస్యల పరిష్కార దిశగా 15 రోజులుగా కృషి చేస్తానని తెలపగా. వారితో రిలే నిరాహార దీక్షలు మింపజేశారు. ఈ సందర్భంగా చేనేత నాయకులు కొంక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చేనేత కార్మికులు కోసం ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీని తక్షణమే అమలు చేయాలని కోరామని, దీనితో పాటు జియో ట్యాగ్ కలిగిన ప్రతి చేనేత కార్మికులను చేనేత సహకార సంఘం లో సభ్యులుగా చేర్చాలని చేనేత కార్మికులకు సంబంధించిన ప్రతి పథకం ఆన్లైన్ ద్వారా స్వీకరించే విధంగా నిబంధనల రూపొందించాలని కోరమని దీనితోపాటు కార్మికులకు కొత్త జియో టాగ్లను కల్పించాలని డిమాండ్ చేశామని వారు 15 రోజుల్లోగా చేనేత రుణమాఫీని తక్షణమే అందించి ఏర్పాట్లు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈరోజు నిరాహార దీక్షలో పాల్గొన్న చేనేత కార్మికులు సామల కైలాసం, ధనంజయ, బిర్రు ఉప్పలయ్య, మిర్యాల కృష్ణమూర్తి, ఎల్లయ్య, పెద్ది సత్తయ్య ,బొడ్డు ప్రసాద్ ఉండగా ఈ కార్యక్రమంలో చేనేత కార్మికుల సంఘం అధ్యక్షుడు అంకం పాండు, చేనేత జన సమాఖ్య రాష్ట్ర నాయకులు చింతకింది రమేష్ ,జిల్లా అధ్యక్షులు కర్నాటి పురుషోత్తం, మాజీ కార్మిక సంఘం అధ్యక్షులు మంగళపెల్లి శ్రీహరి, చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు భారత భూషణ్ ప్రధాన కార్యదర్శి బొమ్మ హరి శంకర్ ,డైరెక్టర్లు పుట్ట బత్తిని వేణు ,కూరపాటి భాస్కర్, తో పాటు చేనేత నాయకులు ఏలే శ్రీనివాస్ , కూరపాటి బాబు, ఇంతకింది దామోదర్, వల్లందాస్ ప్రవీణ్,తదితరులు ఉన్నారు





# కళాశాలల బంద్ విజయవంతం చేయండి

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి-నవభూమి** పెండింగ్ లో ఉన్న 7200 కోట్ల స్కాలర్షిప్,ఫీజు రియంబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని, పిడీఎస్ యూ ఆధ్వర్యంలో కళాశాలల బంద్ పిలుపును విజయవంతం చేయాలని పిడిఎస్ యూ విద్యార్థి సంఘం నాయకులు పిలుపునిచ్చారు.మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆ సంఘం ఆధ్వర్యంలో జూలై 2,3,4 తేదీలలో డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాల బంద్ పిలుపును విజయవంతం చేయాలని గోడ ప్రతులను ఆవిష్కరించారు.ఈ సందర్భంగాపిడిఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు పి సికిందర్ మాట్లాడుతూ ఫీజు రియంబర్స్మెంట్ రాక పేద విద్యార్థులు విద్యకు దూరమైతున్నారని,డిగ్రీ, పీజీ చదువుకున్న విద్యార్థులు పై తరగతికి వెళ్లాలంటే ప్రభుత్వ, ప్రైవేటు యజమాన్యం విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఫీజులు వసూలు చేస్తున్నారని,ఫీజు కట్టలేని పేద విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాను రాను ప్రభుత్వాలు స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేయాలని చూస్తున్నాయని అందులోని భాగంగానే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు యూనివర్సిటీలను ప్రభుత్వ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించే విధంగా పాలన కొనసాగిస్తుందని మండిపడ్డారు.పేద విద్యార్థులకు విద్యను దూరం చేయాలని లక్ష్యంతో పాలకవర్గాలు స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయడం లేదని అన్నారు. తక్షణమే స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని, లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పిడిస్ యూ జిల్లా కమిటీ సభ్యులు కార్తీక్ అన్వేష్, తిరుపతి, సిద్దు, అంజి, విద్యార్థులు వైష్ణవి, రాజేశ్వరి, తిరుమల, సింధు తదితరులు పాల్గొన్నారు.

# మచ్చ బొల్లారం డివిజన్ శక్తి గణేష్ కాలనీ సమస్యలు పరిష్కరించడానికి కృషి

### కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్






**అల్వాల్ , నవభూమి ప్రతినిధి, జూలై 1:** మచ్చ బొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ శక్తి గణేష్ నగర్ లో అధికారులతో కలిసి పర్యటించారు కాలనీలో గల సింహం వారాహి అమ్మవారిని నవరాత్రులలో భాగంగా దర్శించుకుని కుంకుమార్చనలు పాల్గొన్నారు అమ్మవారి పరిసర ప్రాంతాల లో పారిశుద్ధ్య నిర్వహణ , అంతర్గత రోడ్లను వేయాలని అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఏఈ రవళి ఎస్ ఎస్ ప్రభాకర్ ,ఎలక్ట్రికల్ ఏఈ స్రవంతి ,జల మండల అధికారి రమేష్ స్థానిక నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి శ్రీనివాస్ గౌడ్ ,శ్రీశైలం యాదవ్, నవీన్ ,కొండయ్య ,వెంకటేష్, కాలనీ వారు సంతోష్ రెడ్డి శ్రీధర్ రావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రైబల్ వెల్ఫేర్ ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో నిర్వహించాలి

### టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బలాస్టి రమేష్



**మహబూబాబాద్ టౌన్ జూలై 1, నవభూమి ప్రతినిధి:** ట్రైబల్ వెల్ఫేర్ ఉపాధ్యాయుల కోసం ఈనెల 3, 4 తేదీలలో తాడ్వాయిలో నిర్వహించనున్న శిక్షణ తరగతులను మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో నిర్వహించాలని టిపిటిఎఫ్ జిల్లా శాఖ కోరింది. స్మార్టర్ క్లాస్‌రూమ్స్ యుటిలైజేషన్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనే అంశంపై ఈ శిక్షణ తరగతులు తాడ్వాయి ఏహెచ్ఎస్ పాఠశాలలో జరగనున్న నేపథ్యంలో, ఉపాధ్యాయులకు రవాణా, వసతి సౌకర్యాలు లభించేలా జిల్లాకేంద్రంలోనే తరగతులను నిర్వహించాలని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బలాస్టి రమేష్ విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) మహబూబాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బలాస్టి రమేష్, సిరోల్ మండల ప్రధాన కార్యదర్శి బాలాజీ, సజ్జనం మండల ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, రహీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశ వర్కర్లకు పని భారం తగ్గించాలి

### ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు లక్ష్మీ దేవమ్మ, రేణుక

**వీపనగండ్ల జులై 1 నవభూమి** తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ సిఐటియు వీపనగండ్ల మండల కమిటీ ఆధ్వర్యంలో జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆశ వర్కర్స్ పాల్గొంటున్నామని డాక్టర్ సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా తెలంగాణ ఆశా వర్కర్ యూనియన్ జిల్లా నాయకురాలు లక్ష్మీ దేవమ్మ, రేణక లు మాట్లాడుతూ,,, నాలుగు లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని, 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి .ఆశ వర్కర్లను కార్మిక చట్టాల పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు స్థిర కనీస వేతనం నెలకు 26,000గా నిర్వహించాలని డిమాండ్ చేశారు. 45వ మరియు 46వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సుల ప్రకారం ఆశా వర్కర్లకు పెన్షన్, ఇతర సామాజిక భద్రత ప్రయోజనాలను కల్పించాలన్నారు. ఆశ వర్కర్లను మూడవ తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లను ఎన్ హెచ్ ఎం ని శాశ్వత ఆరోగ్య కార్యక్రమం గా నిర్ణయించాలన్నారు.దేశవ్యాప్తంగా ఒకే విధమైన పని పరిస్థితులు అమలులోకి తేవాలన్నారు. వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు , 20 రోజుల క్యాజువల్ సెలవులు, మరియు వేతనంతో కూడిన మెడికల్ సెలవులు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. రిటర్మెంట్ బెనిఫిట్స్ పెన్షన్ ప్రకటించే వరకు పదవి విరమణ ఉండరాదు అన్నారు. అనేక డిమాండ్ల సాధన కోసం దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తూ ఉన్నామని ఈ సమ్మెలో కార్మికులు అందరూ కూడా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం మండల నాయకురాలు లక్ష్మి, పార్వతి, వెంకటమ్మ వెంకటేశ్వరమ్మ, భాగ్యమ్మ, సునీత, శారద, తదితరులు పాల్గొన్నారు



# ఘనంగా శివసాయి పిరమిడ్ వార్షికోత్సవం

- ఒక్క పిరమిడ్ ముక్కోటి దేవాలయాలకు సమానమని హితవు
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న అరుణ జ్యోతి మాస్టర్










**మహాముత్తారం జూన్ 30 నవభూమి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మంజూరు నగర్ 1000 క్వార్టర్స్ లోని శివసాయి పిరమిడ్ ధ్యాన కేంద్రం యొక్క ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జ్ఞానదాత కరీంనగర్ జిల్లా పిరమిడ్ సొసైటీ అధ్యక్షురాలు అరుణ జ్యోతి మేడం హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ... ఒక్క పిరమిడ్ ముక్కోటి దేవాలయాలతో సమానమని అన్నారు. పిరమిడ్ లో ధ్యానం మూడింతల శక్తి అధికమని ధ్యానులంతా పిరమిడ్ ను వినియోగించుకోవాలన్నారు. ఎంతో ఇష్టంతో కష్టపడి శివ సాయి పిరమిడ్ నిర్మాణంలో భాగస్తులైన ప్రతి మాస్టర్ను, ప్రతి వ్యక్తిని అభినందించారు. భూమ్మీద జీవించే ప్రతి వ్యక్తి రుణానుబంధం కలిగిన వారేనని మానవులతో సహా అన్ని జీవరాశులు ఋణానుబంధం తీర్చుకోవడానికే ఉద్భవించాయన్నారు. మానవ జీవితంలో కర్మ సిద్ధాంతం ఎలా పనిచేస్తుందో విశదీకరించారు. అత్తా కోడలు, భార్య భర్త, తల్లిదండ్రులు, తండ్రి కొడుకులు ఒక్కొక్కరి పాత్ర ఒక్కోరకంగ పరిపూర్ణం చేసుకోవాలని జన్మ తీసుకుంటాం. కానీ ప్రాపంచిక మాయలో పడి వచ్చిన పని మర్చిపోయి అనవసరమైన పనులు చేస్తున్నామన్నారు. బ్రహ్మర్షి పితామహ పత్రీజీ కలలుగన్న శాకాహార జగత్, ధ్యాన జగత్, పిరమిడ్ జగత్, అహింస జగత్ సంకల్పంలో ప్రతి ఒక్కరూ భాగస్తులు అవ్వాలని ఆకాంక్షించారు. మంచి పనులు చేస్తే మంచి ఫలితాలు, చెడు పనులు చేస్తే చెడు ఫలితాలు, ఎలాంటి పనులు చేస్తే అలాంటి ఫలితాలు అనుభవిస్తామని అరుణ జ్యోతి తెలిపారు. చేసుకున్న వాడికి చేసుకున్నంత మహాదేవా అని బ్రహ్మర్షి పితామహ పత్రీజీ బోధనలను గుర్తు చేశారు. పత్రీజీ మానస పుత్రిక ధ్యాన జగత్ ను ప్రతి ఒక్కరు ఆదరించాలని ప్రతి ఇంటికి ధ్యాన జగత్ పుస్తకాలు అందేలా చూడాలన్నారు. అనంతరం చిన్నారుల నృత్య ప్రదర్శన సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పిరమిడ్ సొసైటీ అధ్యక్షుడు గడ్డం రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షురాల్లు గాజుల సుజాత, భాగం సీతామహాలక్ష్మి, కేపిసి జనరల్ మేనేజర్ మాధవరావు, పుష్ప మేడం, పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపణలు అర్థరహితం

- కాటారం మండల యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చీటూరి మహేష్ గౌడ్



**కాటారం,జూలై 1 నవభూమి ప్రతినిధి:**మంథని నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు దళితుల పట్ల చేసిన తప్పిదాలను కప్పి పుచ్చు కోవడానికి దళితులపై కపట ప్రేమ చూపిస్తున్నారని కాటారం మండల యూత్ కాంగ్రెస్ నాయకులు అన్నారు.కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రిక విలేకరుల సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. మంథని నియోజకవర్గంలో పుట్ట మధు తన ఉనికిని కోల్పోవడంతో హైదరాబాద్ కు వెళ్ళి ప్రెస్ మీట్ పెట్టాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో జరిగిన హత్యలు రౌడీ రాజకీయం పుట్ట మధు ఎమ్మెల్యేగా,బిఆర్ఎస్ పార్టీ అధికారం లో ఉన్నప్పుడే జరిగాయని ఆరోపించారు. దళితులపై కపట ప్రేమ నటిస్తూ దళితులనే హత మార్చిన ఘనత పుట్ట మధు కే దక్కుతుందని, తను దళితుల పక్షాన ఉన్నానంటూ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని అన్నారు.మంత్రి శ్రీధర్ బాబు, కాంగ్రెస్ పార్టీ దళిత నాయకుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తున్నారని,వారికి ఏ సమస్య వచ్చిన క్షణంలో పరిష్కారానికి కృషి చేస్తారని అన్నారు.ఈ ప్రాంత అభివృద్ధి పట్ల పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండి ఆ పనులు చేస్తున్న వ్యక్తి మంత్రి శ్రీధర్ బాబు అని పేర్కొన్నారు.ఇక్కడ మండల స్థాయిలో ఉన్న బిఆర్ఎస్ నాయకులు కూడా పూర్తి అవగాహన లేకుండా తమ నాయకుడు ఏం మాట్లాడిన వత్తాసు పలుకుతూ వ్యక్తిగతంగా మంత్రి శ్రీధర్ బాబు పై అసత్య ఆరోపణలు,అనుచిత వ్యాఖ్యలు చేయడం సరి కాదని మరోసారి పునరావృతం కాకుండా చూసు కోవాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చీటూరి మహేష్ గౌడ్,యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ ప్రధాన కార్యదర్శి కడారి విక్రమ్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పసుల మొగిలి,ఓడిపిలవంచ మాజీ సర్పంచ్ కోడి రవి కుమార్,బోడ నరేష్, మేడిపల్లి కిరణ్,బీరెల్లి మహేష్,గడవేని దేవేందర్ యాదవ్,బొడ్డు రాజశేఖర్,జాడి రాజేష్,మంత్రి నరేష్,గోనె మహేష్, సమ్మయ్య,సంపత్,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు

# దేవదూతలుగా సేవలు అందించాలి

- మిర్యాలగూడలో పిజి మెడికల్ కాలేజీతో ఆరోగ్య తెలంగాణకు ముందడుగు
- ఎమ్మెల్యే బిఎల్ఆర్
- పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి:అదనపు కలెక్టర్ అమిత్






**మిర్యాలగూడ నవభూమి జూలై 1:-** ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేద ప్రజలకు వైద్య సేవలు నిస్వార్థంగా దేవ దూతలుగా డాక్టర్లు సేవలు అందించాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ కోరారు. మంగళవారం జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో డాక్టర్లకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు కల్పించామని ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రుల మాదిరి సేవలందించాలని కోరారు. ఏ సమస్య వచ్చిన పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఏరియా ఆసుపత్రికి బ్లడ్ బ్యాంక్ మంజూరు అయ్యిందని. ఆయన తెలిపారు. మిర్యాలగూడ నియోజకవవర్గానికి పోస్టు గ్రాడ్యుయేషన్ మెడికల్ కాలేజీ మంజురయైనదని ఆరోగ్య తెలంగాణ సాధనలో ముందుండుగు కావాలని ఆయన అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య భద్రతకు చేస్తున్న కృషికి డాక్టర్లు చేయుతనివ్వాలని కోరారు. మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిని ఆదర్శంగా చేయాలని ఆశ. నిబద్ధతకు సరిహద్దులు లేవు జీవులను రక్షించేందుకు కృషి చేస్తున్న డాక్టర్లు దేవ దూతలని ఆయన తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే బిఎల్ఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్స్ డేలో ఆయన మాట్లాడుతూ వచ్చిన పేదలకు ఎక్కడికి రిఫర్ చేయకుండా ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రిలా ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు అందించాలని ఆయన కోరారు. పేదలే ప్రభుత్వ ఆసుపత్రికి వస్తారని, మెరుగైన సేవలు అందించాలని నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్ కోరారు. ఆసుపత్రులపై దాడులు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేదలకు వైద్య సేవలు సంపూర్ణంగా అందించాలని కోరారు. సమయపాలన పాటించాలని కోరారు. వైద్య సేవలు అందించే క్రింది స్థాయి నుండి డాక్టర్ల స్థాయి వరకు వైద్య సేవలు అందిస్తున్నందుకు శుభాకాంక్షలు అమిత్ తెలిపారు. బిసి రాయ్ ఆశయ సాధనకు కృషి చేయాలని డాక్టర్ జె.రాజు కోరారు. దాడులు చేయడం తగదు డాక్టర్ మువ్వా రామారావు అన్నారు. డాక్టర్, రోగి రక్షణకు చట్టం ఉన్నదిల ఏదైనా న్యాయస్థానాన్నిబి ఆశ్రయించవచ్చని ఆయన అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సీనియర్, నిష్ణాతులైన, జూనియర్ డాక్టర్లను ఖాదీ టవలు, బొకేతో సన్మానించారు. తొలుత డాక్టర్ బిసి రాయ్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి జోహార్లర్పించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్, ఏరియా ఆసుపత్రి డాక్టర్ శ్రీనివాస్ సమరథ్, డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓలు డాక్టర్ కేసా రవి, డాక్టర్ ఎస్.గీతావాణి, ఐఎంఎ అధ్యక్షుడు డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ బి.నాగేందర్, డాక్టర్ కె.కృష్ణప్రసాద్, డాక్టర్ పి.పద్మనాభరెడ్డి, డాక్టర్ కె.శ్రీనివాస్ రాజు, డాక్టర్ జి.అంజయ్య, డాక్టర్ అశోక్ రెడ్డి, డాక్టర్ మంజుల, డాక్టర్ గంగవరప్రసాద్, డాక్టర్ అశోక్ కుమార్, డాక్టర్ వేణు, డాక్టర్ భానుప్రసాద్, డాక్టర్ చందు, డాక్టర్ హెచ్కే బాబు, పిహెచ్సి డాక్టర్ ఎస్కే మోయిద్, డాక్టర్ శేఖర్ రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్ రాజు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి:జిల్లా నోడల్ అధికారి డాక్టర్ వంశీకృష్ణ



**వీపనగండ్ల జులై 1 నవభూమి** వీపనగండ్ల మండల కేంద్రంలోని సామాజిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ వంశీకృష్ణ, మండల వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,,, ప్రజల ఆరోగ్యం పట్ల ఆశ వర్కర్ల ప్రభుత్వం గా ఉండాలని కోరారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజలు నీళ్లను వేడి చేసుకుని తాగాలని, దోమల బారి నుండి వ్యాధులు సంక్రమించకుండా ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సలహా ఇచ్చారు. ఆసుపత్రి సిబ్బంది మాత శిశు సంరక్షణ గురించి చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యులు హేమ వర్ధన్, శ్వేత, కరుణా శ్రీ, కవిత, సిహెచ్ఓ దయామని, విజయ్ కుమారి, రాఘవేందర్, ఏఎన్ఎం ఆశ వర్కర్లు పాల్గొన్నారు

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రాంచందర్ రావు ఎంపిక పట్ల హర్షం

### భూపాలపల్లి జిల్లా కౌన్సిలర్ బొమ్మన భాస్కర్ రెడ్డి



**కాటారం,జూలై 1 నవభూమి ప్రతినిధి:**తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడిగా రాంచందర్ రావు ఎంపిక పట్ల జయశంకర్ భూపాలపల్లి జిల్లా బీజేపీ కౌన్సిలర్ బొమ్మన భాస్కర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేస్తూ రామచంద్ర రావు కు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బొమ్మన భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. వివాద రహితుడు గా,సౌమ్యుడిగా పేరున్న మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావును బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా ఎంపిక చేయడం హర్షించదగ్గ విషయంగా పేర్కొన్నారు.విద్యార్థి దశ నుండి ఏబీవీపీ సంగు పరివార్ క్షేత్రాలలో జాతీయ వాది గా పనిచేశారని పార్టీ శ్రేణులు వారి నాయకత్వంలో ముందు కెళ్తారని ఆశిస్తున్నారని అన్నారు. రామచందర్ రావు నేతృత్వంలో రాబోయే ఎన్నికల్లో కాషాయం జండా రెపరెప లాడడం ఖాయం అని అన్నారు.

# జిల్లాలో పక్కాగా పారిశుద్ధ్య నిర్వహణ

### భూగర్భ జలాల పెంపుకు చర్యలు

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్





**జనగామ నవభూమి ప్రతినిధి జులై(01)** జిల్లాలోనిఅన్నిగ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సమర్థ వంతంగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు.సెంటర్ ఫర్ గుడ్ గవర్నన్స్ కార్యక్రమంతో మంగళవారం తమిళనాడునుండి సర్పంచ్, బ్లాక్ ప్రసిడెంట్,అధికారులు జిల్లాకి క్షేత్ర స్థాయి పరిశీలనకై రావడం జరిగిందన్నారు.వారిని లింగాల ఘణపురం మండలం నెల్లుట్ల గ్రామానికి డిపోఓ స్వరూప గౌరవంగా స్వాగతం పలుకుతూ అక్కడప్రాంతంలో ఉన్న తడి పొడి చెత్త,పారిశుధ్య నిర్వహణ నర్సరీలో మొక్కల పెంపకం జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు అనంతరం జడ్పీ కార్యాలయానికి విచ్చేసిన తమిళనాడుబృందంతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతీ గ్రామ పంచాయతీలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ, తడి పొడి చెత్త నిర్వహణ ద్వారా వస్తున్న ఆదాయం,నర్సరీలో మొక్కల పెంపకం విధానం, భూగర్భ జలాల పెంచేందుకు ఇంకుడు గుంతల నిర్మాణం,తద్వారా పెరిగిన ఆయకట్టు,పంటలసాగు,పక్కాగా శాని టేషన్ నిర్వహణ వల్ల సీజనల్ వ్యాధులనుఅరికడుతున్నతీరును సర్పంచ్ బృందానికి కలెక్టర్ వివరించారు.ఈకార్యక్రమంలో జడ్పీసీఈఓ మాధురిషా,డిపిఓ స్వరూప తదితరులు పాల్గొన్నారు

# యత్నారంలో ఫోన్ చేయాలంటే చెట్లు ఎక్కాల్సిందే



**మహాముత్తారం జులై 1 నవభూమి:** మహాముత్తారం మండలం యత్నారం గ్రామ ప్రజల సెల్ఫోన్ కష్టాలు వార్ణనాతీతం. ఆ గ్రామస్తులకు ఫోన్లు రావాలన్న, ఫోన్ చేయాలన్న వారి ఫోన్లన్నీ సమీపంలోని చెట్లకు కట్టాల్సిందే. అదేవిధంగా వారు ఫోన్ మాట్లాడాలన్నా చెట్లపై ఎక్కి సిగ్నల్ సెర్చ్ చేసుకొని మాట్లాడుకునే పరిస్థితి నెలకొంది. సెల్ఫోన్ సిగ్నల్స్ లేక గ్రామస్తులు విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు. ఆ గ్రామంలో ఆన్లైన్ లావాదేవీలు చేయాలన్న అనేక అవస్థలు పడాల్సిందే. అన్ని సేవలు సెల్ ఫోన్ మయమైన ఈ రోజుల్లో ఆ గ్రామానికి సెల్ టవర్లు అందుబాటులో లేక గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా గ్రామస్తుల సౌకర్యార్థం సమీపంలోని సెల్ టవర్ల సిగ్నల్ ఫ్రీక్వెన్సీ పెంచడం అయిన లేదా ఆ గ్రామంలో సెల్ టవర్ అయినా నెలకొల్పాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ప్రయాణం..ప్రాణ సంకటం



**మహాముత్తారం జులై 1 నవభూమి:** మహాముత్తారం మండలంలోని వివిధ గ్రామాల మధ్య రహదారులు పూర్తిగా దెబ్బతిని అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ప్రజలు వాపోతున్నారు. బోర్లగూడెం-నర్సింగాపూర్ గ్రామాల మధ్య రోడ్డు పూర్తిగా ధ్వంసమై ప్రయాణ సౌకర్యానికి ఆటంకం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డాంబర్ రోడ్డుపై కంకర కొట్టుకుపోయి రోడ్డంతా గుంతలు ఏర్పడి బురదమయం అయింది. ఈ రోడ్డు భూపాలపల్లికి వెళ్లే మెయిన్ రహదారి కావడంతో నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండి వాహనాలు ఒకదానికొకటి ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయని వివిధ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిమ్మగూడెం నుండి యత్నారం, సింగంపల్లి, కనుకునూరు వరకు మహాముత్తారం నుండి వజినపల్లి, పోలారం నుండి ఊట్లపెల్లి గ్రామాల్లో రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. మారుమూల పల్లెల్లో రోడ్లు బాగాలేక వ్యవసాయం చేసుకునే రైతన్నల గోస వర్ణనాతీతం, పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని పత్రికల్లో చదవడమే గాని ఆచరణలో లేదని వాపోతున్నారు. మండలంలోని రాజకీయ ప్రజా ప్రతినిధులు, ఉన్నత అధికారులు రోడ్లపై ఎందుకు శ్రద్ద పెడుతలేరని ప్రజలకు ఏమైనా ఇంతేనా అంటున్నారు. ప్రభుత్వాలు మారిన రోడ్లు మారకపోవడంపై ప్రజలు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకోని మహాముత్తారం మండలంలోని గిరిజన గ్రామాల్లో రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని నూతన రోడ్లు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ మరమ్మతులు

### మానవత్వం చాటుకున్న కాటారం మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య,చీమల రాజు





**కాటారం,జులై 1 నవభూమి ప్రతినిధి:**కాటారం మండల కేంద్రం లోని కస్తూర్బా పాఠశాల ముందు మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ వలన నీరు వృధాగా పోతుండటంతో,దీని వలన ప్రజలు అనేక అవస్థలకు గురవుతున్నారు.ఈ సమస్యను ప్రజలు కాటారం మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య,కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చీమల రాజు దృష్టికి తీసుకెళ్లడంతో వృధాగా పోతున్న మంచి నీటి ప్రాంతాన్ని పరిశీలించి,రిస్టోర్ పనులను చేపట్టి పూర్తి చేయించారు.ఈ సమస్యను వెంటనే పరిష్కారం అయ్యేందుకు కృషి చేసిన మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య,చీమల రాజు లను గ్రామ ప్రజలు అభినందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భూపెల్లి రాజు,ఆత్మకూరి కుమార్ యాదవ్,బీరెల్లి మహేష్,దొంగిరి రవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన

### మహాత్మా జ్యోతిబా పూలే బాలుర హాస్టల్‌లో ఆరోగ్య వైద్య శిబిరం

### కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్. మౌనిక






**కాటారం,జులై 1 నవభూమి ప్రతినిధి:**కాటారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర హాస్టల్ లో మంగళవారం రోజున ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మౌనిక ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు.విద్యార్థుల కు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు.పిల్లలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు.ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత అవసరమని,పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.అలాగే పిల్లలు పౌష్టిక ఆహారం తినాలని, ప్రతిరోజూ యోగా,ద్యానం చేయాలని,క్రీడల్లో కూడా రాణించాలని విద్యార్థులకు సూచించారు. అల్పాహారం,భోజనం చేసే ముందు,తర్వాత చేతులు శుభ్రంగా కడగాలని అవగాహన కల్పించారు.వంటశాల,శానిటేషన్ పరిసరాలను తనిఖీలు చేసి పలు సూచనలు చేశారు.వండిన ఆహారం పై ఎప్పుడూ మూతలు పెట్టీ ఉంచాలని, విద్యార్థులకు ఆహారం వేడిగా ఉన్నప్పుడు మాత్రమే వడ్డించాలని తెలియజేసారు.ఈ కార్య క్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మౌనిక, ఎంఎల్ఎచ్పి డాక్టర్ తిరుపతి రెడ్డి,ఆరోగ్య విస్తరణ అధికారి ఏ.స్వామి,హెల్త్ అసిస్టెంట్ టి.సమ్మయ్య, ఏఎన్ఎం శ్యామల,ఆశా కార్యకర్తలు స్వరూప, రాణి,లత,మహాత్మా జ్యోతిబా పూలే హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ కార్యాలయంలో సమన్వయ సమావేశం

**కాటారం,జులై 1 నవభూమి ప్రతినిధి:**జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రోజున ఎంపిడిఓ అద్దూరి బాబు అధ్యక్షతన పంచాయతీ పురోగతి సూచిక 2023 – 24 అంశం పై సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కాటారం ఎంపిడిఓ అద్దూరి బాబు,మండల పంచాయతీ అధికారి వీరస్వామి,మండల స్థాయి అధికారులు,గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



### పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల

# సమస్యలను పరిష్కరించాలి

◆ జిల్లా డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్



**భూపాలపల్లి/మహాముత్తారం జులై 1 నవభూమి:** గత ప్రభుత్వంలోనే అమలులోకి రావలసిన పి.ఆర్.సి, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించడం, బకాయి పడ్డ బిల్స్ ను వెంట వెంటనే ఇవ్వడం వగైరా సమస్యలు ప్రస్తుత ప్రభుత్వంలో కూడా పెండింగ్ లోనే ఉన్నాయని వీటిని వెంటనే పరిష్కరించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ అశోక్, ఏ తిరుపతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రోజున టిటిఎఫ్ జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం జిల్లా కేంద్రంలోని సంఘమిత్ర డిగ్రీ కళాశాలలో జిల్లా అధ్యక్షులు సిహెచ్ అశోక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ అశోక్, ఏ.తిరుపతి లు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అనుసరించిన విద్యారంగ అపసవ్య దోరణలకు వ్యతిరేకంగా ఉపాధ్యాయ లోకం అనేక పోరాటాలు నిర్వహించిందని ఆ పోరాటాల ఫలితంగానే నేటి ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో విద్యారంగానికి 15% బడ్జెట్ కేటాయింపు అధికారంలోకి రాగానే పిఆర్సి అమలు సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, పెండింగ్ బిల్స్ క్లియర్ చేయడం




లాంటి వాటిని పేర్కొనడం జరిగిందన్నారు. కానీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల గడిచినప్పటికీ అమల్లోకి రాలేదని పేర్కొన్నారు. మరొకవైపు కేంద్ర ప్రభుత్వం ఎన్ఈపి 2020 విధానాన్ని మన రాష్ట్రంలో అమలులోకి తీసుకొస్తుందని ఇది పూర్తిగా ప్రైవేటీకరణను పెంచే విధంగా ఉంటూ ప్రభుత్వ విద్యారంగాన్ని పూర్తిగా విధ్వంసం చేస్తూ శాస్త్రీయ ఆలోచనలను తగ్గించే విధంగా ఉంటుందన్నారు. కాబట్టి వెంటనే ఎన్ఇపీ 2020ని రద్దు చేసి శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించే విధంగా ఉండే విద్యా విధానాన్ని తీసుకురావాలన్నారు. కాబట్టి తక్షణమే ఎన్ఈపి 2020 ని మన రాష్ట్రంలో అమలులోకి రాకుండా ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, తిరుపతిరెడ్డి, వీరేశం, వీరన్న, ప్రభాకర్లతో పాటు రాష్ట్ర కౌన్సిలర్స్ సుదర్శనం, రమణారెడ్డి, లక్ష్మణ్ నాయక్, సుదర్శన్, రవీందర్ రెడ్డి లు మరియు మండల ప్రధాన బాధ్యులు రాంసింగ్, విజయ్ కుమార్, మధు, సారంగపాణి సంపత్, శ్రీనివాస్, రాజేశం, మెహరాజ్ , చంద్రశేఖర్, అపర్ణ గోవర్ధన్, శ్రీనివాస్, సిరాజుద్దీన్, మహేష్ ఆడిట్ కమిటీ సభ్యులు జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం

◆ మన హక్కులకోసం మనమే పోరాడాలి - సింగరేణి యూనియన్స్ జేపీసీ కన్వీనర్ కోట రవీందర్ రెడ్డి

**రామగిరి, జులై 01 నవభూమి న్యూస్:** ఆర్జీ త్రి ఏరియా లోనీ ఓసిపి టు సింగరేణి యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో జులై 9 వ తేదీన జరగబోయే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయుటలో భాగంగా గేట్ మీటింగ్ సమావేశం మంగళవారం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జేఏసీ కన్వీనర్, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి, ఎఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ ఎమ్ ర్ సి రెడ్డి, సీఐటియు బ్రాంచ్ సెక్రెటరీ కొమురయ్య, టిజీబీకేస్ వైస్ ప్రెసిడెంట్ నాగేల్లి సాంబయ్య లు హాజరు కావడం జరిగింది . అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు మరియు నాలుగు లేబర్ కోడ్ ల రద్దు చేయాడమే ప్రధాన డిమాండ్ అని తెలిపారు అలాగే కాంట్రాక్ట్ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారము కనీస వేతనం 26000 ఉంటూ సమాన పనికి సమాన వేతనం



ఇవ్వాలి.బొగ్గు తీసే పనుల్లో పర్మనెంట్ కార్మికులనే నియమించాలి.నూతన బొగ్గు గనులు ఏర్పాటు చేయాలి.కొంత బొగ్గుగనుల వేలంపాట కాకుండా సింగరేణి సంస్థకే కేటాయించాలి. కార్మికులందరికీ నెలకు కనీస పెన్షన్ 9000 ఇవ్వాలి, పాత పెన్షన్ ని పునరుద్ధరించాల సింగరేణి కార్మిక యూనియన్ జేఏసీ తరుపున కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.ఇలా మరెన్నో కార్మికుల హక్కులు కాల రాస్తున్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జులై 9 వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో జేఏసీ యూనియన్ నాయకులు మరియు కార్మికులు పాల్గొన్నారు.

## ఘనంగా మార్కెట్ కమిటీ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి జన్మదిన వేడుకలు



**ఇబ్రహీంపట్నం, జులై 1 (నవభూమి ప్రతినిధి):** ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గుర్నాథ్ రెడ్డి జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని వినోభనగర్ లో ఉన్న స్ఫూర్తి జ్యోతి పౌండేషన్ అంధ విద్యార్థుల వసతి గృహంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరిపారు. అనంతరం విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి సొప్పరి రవికుమార్ (టోనీ), కాంగ్రెస్ సేవాదళ్ మున్సిపల్ అధ్యక్షులు జమాల్ పూర్ శ్యామ్ లాల్ మాట్లాడుతూ కంబాలపల్లి గుర్నాథ్ రెడ్డి ఇలాంటి మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, అనేక ఉన్నత పదవులను అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సల్మాన్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ డిజి స్కూలులో పార్య పుస్తకాల సీజ్

**మిర్యాలగూడ నవభూమి జులై 1:-** మిర్యాలగూడ పట్టణంలోని ఎస్ఆర్ డిజి స్కూలులో మంగళవారం ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అమ్ముతున్నారని రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాల నాయకులు మండల విద్యాధికారి ఎల్. బాలునాయక్ ఫిర్యాదు చేశారు. దింతో ఆయన వెంటనే స్కూలుకు చేరుకుని నిర్ధారణ చేసుకొని సుమారు 50 వేల విలువైన పుస్తకాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం నాయకులు జి. మహేష్ గౌడ్, ఎఐఎంఐఎం నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శి సయ్యద్ ఫారూఖ్ తదితరులున్నారు. అదేవిధంగా శ్రీచైతన్య స్కూల్లో కూడా నిబంధనలకు విరుద్ధంగా పార్య పుస్తకాలు అమ్ముతున్నట్టు హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ అవేర్నెస్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ నజీరుద్దీన్ ఎంఇఓకు ఫిర్యాదు చేశారు.



## ఘనంగా డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య జన్మదిన వేడుకలు

### కమ్మగూడ ప్రాథమిక పాఠశాలలో పుస్తకాల పంపిణీ

**అబ్దుల్లాపూర్ మెట్, జులై 1 (నవభూమి ప్రతినిధి):** టీజీకాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన జన్మదినం సందర్భంగా కుమారుడు కొత్తకుర్మ తిలక్ తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడ శ్రీశ్రీ నగర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీతో పాటు పాఠశాల కోసం సౌండ్ బాక్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కొత్తకుర్మ తిలక్ మాట్లాడుతూ తన తండ్రి డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య జన్మదినం సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తామని అన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు కొత్తకుర్మ తిలక్ ను శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. కొత్తకుర్మ సత్తయ్య మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, అనేక ఉన్నత పదవులను అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ కాంగ్రెస్ నాయకుడు మేతరీ శంకర్, పాఠశాల ఉపాధ్యాయులు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.







## పునర్ జన్మ ప్రసాదించే వైద్యులు దైవ సమానులు



**కాటారం,జులై 1 నవభూమి ప్రతినిధి:**జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల పరిషత్ కార్యాలయంలో డాక్టర్స్ డే సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో కాటారం ఎంపిడిఓ అద్దూరి బాబు చేతుల మీదుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మౌనిక కు శాలువాతో సన్మానం చేసి,శుభాకాంక్షలు తెలియ జేశారు.ఈ సందర్భంగా ఎంపిడిఓ అద్దూరి బాబు మాట్లాడుతూ..సమాజంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి మెరుగైన వైద్యం అందించి పునర్ జన్మ ప్రసాదించే వైద్యులు దైవ సమానులు అని అన్నాడు.మండల పంచాయతీ అధికారి వీరస్వామి మాట్లాడుతూ..మనిషి పుట్టుక నుంచి చివరి క్షణం వరకు ప్రతీ ఒక్కరి జీవితంలో వైద్యుల పాత్ర అత్యంత కీలకమైనదని అన్నారు.వారి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్యుల కృషి అమోఘమని కొనియాడారు.కరోనా క్లిష్ట సమయంలో కూడా పగలు,రాత్రి అనే తేడా లేకుండా పని చేస్తూ ప్రజల ప్రాణాలను కాపాడిన డాక్టర్లు నిజమైన యోధులను ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో కాటారం ఎంపిడిఓ అద్దూరి బాబు,మండల పంచాయతీ అధికారి వీరస్వామి, ఐసిడిసి సూపర్ వైజర్ వీణ,గ్రామ పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మళ్లపల్లిలో భూ సేకరణపై గ్రామసభ



**కాటారం,జులై 1 నవభూమి ప్రతినిధి:**కాటారం మండలం లోని గుమ్మళ్లపల్లి గ్రామంలో చిన్న కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ లో బాగంగా గుమ్మళ్లపల్లి ( ఊర చెరువు) ట్యాంక్ విస్తరణ కొరకు భూ సేకరణ పై మంగళవారం రోజున పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు.ట్యాంక్ విస్తరణ కొరకు అవసరమగు 6 – 03 గుంటల భూమి కొరకు భూ నిర్వాసితుల నుండి అభ్యంతరాలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఉప కలెక్టర్,నాయబ్ తహసీల్దార్ లు, ఎస్టీసి కార్యాలయ సిబ్బంది,నీటి పారుదల శాఖ ఏఈ,తహశీల్దార్ నాగరాజు,రెవిన్యూ ఇన్ స్పెక్టర్, జూనియర్ అసిస్టెంట్,రెవిన్యూ సిబ్బంది,గ్రామ ప్రజలు,రైతులు తదితరులు పాల్గొన్నారు.


## భూపాలపల్లి మండల,పట్టణ మహిళా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**కాటారం,జులై 1 నవభూమి ప్రతినిధి:**జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని భూపాలపాలి మండల,పట్టణ మహిళా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాలను మంగళవారం రోజున భూపాలపల్లి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సభ్యులందరి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ ఎన్నికలకు ఎలక్షన్ ఆఫీసర్ గా జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు అయితూ రమేష్,పరిశీలకులుగా కలికోట శ్రీనివాస్ లు వ్యవహరించారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని భూపాలపల్లి పట్టణ మహిళా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షురాలుగా రేగూరి శారద,ప్రధాన కార్యదర్శిగా పడకంటి గంగామణి,కోశాధికారిగా పల్లెర్ల సౌజన్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అలాగే భూపాలపల్లి మండల మహిళా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షురాలిగా తొడుపునూరి స్వప్న,ప్రధాన కార్యదర్శిగా సిరుప సింధు,కోశాధికారిగా అయిత వరలక్ష్మీ లను జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు నరేంద్రుల ధనలక్ష్మి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా అధ్యక్షురాలు ధనలక్ష్మి నూతన కార్యవర్గాలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ,శాలువాతో సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మండల,పట్టణ ఆర్యవైశ్యులు,మహిళా సభ్యులు,రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నాయకుడు సిరుప అనిల్,భూపాలపల్లి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పవిత్రం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మల్టీపర్పస్ సెంటర్ సుదర్శన

**వాంకిడి జులై 1 నవభూమి** వాంకిడి: మండలంలోని శిరిడి గ్రామపంచాయతీ పరిధిలో గల లింబుగూడలో పిఎం జన్ మన్ పథకంలో భాగంగా నిర్మించిన మల్టీ పర్పస్ సెంటర్లో మంగళవారం అదనపు బాలనాధికారి దీపక్ తివారి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రంలో నిర్వహించనున్న అంగన్వాడి కేంద్రం, హెల్త్ కార్యలాయాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఐటిడిఏ ఏఈ నజీమోద్దీన్ ను ఆదేశించారు. సెంటర్ ఆవరణలో పూలు, తదితర మొక్కలను నాటాలని, త్వరలో ప్రారంభోత్సవాన్ని అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం వాంకిడి పంచాయతీలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులు త్వరగా పనులు పూర్తి చేసుకోవాలని తదుపరి విడతలవారీగా నిధులు మంజూరు అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డిటి డబ్ల్యూ వొ రమాదేవి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంపీ ఓ జావిద్, ఏపీవో శ్రవణ్ కుమార్, ఈ సి మోసిన్ తదితరులు పాల్గొన్నారు.



# మహా బోధి బుద్ధ విహార్‌ను బౌద్ధులకు అప్పగించాలి



**వాంకిడి, నవభూమి న్యూస్ జూలై 1:** బీహార్ రాష్ట్రం గయ జిల్లాలోని మహా బోధి బుద్ధ విహార్‌ను బౌద్ధులకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ బౌద్ధ భిక్షులు ఇచ్చిన భారత్ బంద్‌కు వాంకిడి మండల కేంద్రంలో మంగళవారం మద్దతుగా బౌద్ధులు, అంబేద్కర్ సంఘాలు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. జేత్వాన్ బుద్ధ విహార్ ఎదుట జాతీయ రహదారి సర్వీస్ రోడ్‌పై ఈ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ జిల్లా భారతీయ బౌద్ధ మహాసభ అధ్యక్షుడు అశోక్ మహుల్కర్, అంబేద్కర్ సంఘం వాంకిడి అధ్యక్షుడు దుర్గం దుర్గాజీ మాట్లాడుతూ "మహా బోధి బుద్ధ విహార్ ముక్తి కోసం గత మూడు నెలలుగా దేశవ్యాప్తంగా బౌద్ధులు నిరంతరం పోరాటం చేస్తున్నారు. కానీ బీహార్ రాష్ట్ర పాలకులు వివక్ష చూపుతూ ఈ సమస్యను పట్టించుకోవడం లేదు" అని విమర్శించారు. 1949లో అమలులోకి వచ్చిన లోపభూయిష్ట చట్టం వల్ల బుద్ధ విహార్‌పై పూర్తి హక్కులు బౌద్ధులకు లేకుండా పోయాయని, ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేసి విహార్‌ను బౌద్ధులకు అప్పగించాల్సిన అవసరం ఉందని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి విజయ్ ఉప్రే, గౌరవ అధ్యక్షుడు జయరాం ఉప్రే, బౌద్ధ సమాజం, అంబేద్కర్ సంఘం నాయకులు పాండుజీ, రోషన్, అరుణ్, రాజేంద్రప్రసాద్, రమేష్, మనోజ్, నూతన్, వివేక్ ఉప్రే, సురేందర్, దుర్గం చింతా, దుర్గం ప్రశాంత్, స్వాగత్, ఇంద్రజీత్ తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి మండల,పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**కాటారం,జూలై 1 నవభూమి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని భూపాలపాలి మండల,పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాలను మంగళవారం రోజున భూపాలపల్లి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం లో సభ్యులందరి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు ఎలక్షన్ ఆఫీసర్ గా జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు అయితూ రమేష్,పరిశీలకులుగా కలికోట శ్రీనివాస్ లు వ్యవహరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని భూపాలపల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడుగా దొడ్డ రాజు,ప్రధాన కార్యదర్శిగా పల్లెర్ల రవి కుమార్,కోశాధికారిగా మామిడిశెట్టి రంజిత్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే భూపాలపల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడుగా సిరుప లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షునిగా నాబిళ్ల ధనంజయ,ప్రధాన కార్యదర్శిగా తొడుపునూరి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా శివనాద్రి శ్రీనివాస్ లను భూపాలపల్లి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పవిత్రం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు పవిత్రం శ్రీనివాస్ నూతన కార్య వర్గాలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ,శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మండల,పట్టణ ఆర్యవైశ్యులు,ఆర్యవైశ్య మహిళా సభ్యులు,రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నాయకుడు సిరుప అనిల్,భూపాలపల్లి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పవిత్రం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ ఒకరు మృతి

**వాంకిడి-నవభూమి:** వాంకిడి మండలంలోని రాజీవ్ నగర్ గ్రామానికి చెందిన నాయిని మనోహర్ (45) మంచిర్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు వాంకిడి ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. వాంకిడి ఎస్ఐ ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. జూన్ 26న వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వచ్చినా మనోహర్ మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు..అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. సోమవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడి కొడుకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వాంకిడి ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు.

## మద్యం మత్తులో ఉరేసుకుని ఒకరు మృతి

**వాంకిడి నవభూమి :** మద్యానికి బానిసైన ఓ వ్యక్తి చేనులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూర్ మండలంలోని రేచిని గ్రామానికి చెందిన వడై వెంకటి(40) అనే వ్యక్తి వాంకిడి మండలంలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన తానుబాయిని వివాహం చేసుకున్నాడు. వివాహానంతరం నిత్యం మద్యం మత్తులో ఉండే వాడు. మద్యం అలవాటు మాన్పించాలనే ఉద్దేశ్యంతో భార్య గ్రామమైన నార్లాపూర కు తీసుకువచ్చి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. కొంత కాలంగా మళ్లీ మద్యానికి బానిసైన వెంకటి ప్రతీ రోజు మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడుతుండే వాడు. కుటుంబ సభ్యులు మందలించేందుకు ప్రయత్నిస్తే ఉరేసుకుంటానని బెదిరింపులకు గురి చేసేవాడు. ఈ క్రమంలోనే సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో వాంకిడి వెళ్లోస్తానని చెప్పి బయటికి వెళ్లి తిరిగి మళ్లీ ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇల్లలో గాలించిన ఆచూకి లభించలేదు. ఆదివారం ఉదయం అదే గ్రామానికి చెందిన వడై సంతోష్ అనే వ్యక్తి చేనులో గల వేప చెట్టుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి బాబు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య తానుబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## జీవో 49ను రద్దు చేయాలని తహశీల్దార్ కవితకు వినతి పత్రం

**వాంకిడి జూలై 1 నవభూమి న్యూస్ :** ఆదివాసీలను అడవుల నుంచి వెళ్లగొట్టే కుట్రలో భాగంగా తీసువచ్చిన జీవో 49 చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ టిఏజిఎస్ సంఘం నాయకులు మంగళవారం తహశీల్దార్ డి.కవితకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ జీవో 49 ద్వారా 3,7400 ఎకారాలను రిజర్వ్ చేసిందని, దీనిలో ఆదివాసీలతో పాటు గిరిజనేతరుల పోడు భూములు ఉన్నాయని అన్నారు. 339 గ్రామాలలో సదస్సులు నిర్వహించినట్లు అటవి శాఖ అధికారులు చెప్పడంలో నిజం లేదని ఆన్నారు. భవిష్యత్తులో ఈ గ్రామాలను ఖాళీ చేయించే లక్ష్యంతో కుట్ర జరుగుతుందని ఆరోపించారు. ఆదివాసీలకు నష్టం కలిగించే ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నేర్పల్లి అశోక్. ఉపాధ్యాక్షుడు కోట శ్రీనివాస్, జిల్లా నాయకులు సిడాం పగ్గు, సిడాం అన్నిగ, తదితరులు ఉన్నారు.



# ప్రణాళిక బద్ధంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు

- తుర్కయంజాల్ లో రూ. 6.70 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి







**అబ్దుల్లాపూర్ మెట్, జులై 1 (నవభూమి ప్రతినిధి):** ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టి మున్సిపాలిటీలను రాష్ట్రంలోని ఆదర్శంగా తీర్చిదిద్దన్నట్లు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చెప్పారు. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కోహెడా, ఇంజాపూర్, తొర్రూర్, మునుగనూర్ లలో సుమారు రూ. 6.70 కోట్లం రూపాయల వ్యయం తో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పెండింగ్లో ఉన్న పనులను వేగంగా పూర్తి చేసి నూతన పనులను ప్రారంభించనున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టి మున్సిపాలిటీలను అభివృద్ధి పథంలో నడిపించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షురాలు, మాజీ కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, మాజీ కౌన్సిలర్ లు హరిత ధనరాజ్ గౌడ్ ఆయిలయ్య, కమీషనర్ అమరేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- మునగనూరులో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల భవన నిర్మాణానికి శంకుస్థాపన
- రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్





**అబ్దుల్లాపూర్ మెట్, జులై 1 (నవభూమి ప్రతినిధి):** రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పునరుద్ఘాటించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తుర్కయంజాల్ మున్సిపాలిటీ మునగనూరు బ్యాంకు కాలనీ వద్ద ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల కోసం నిర్మించబోయే భవన నిర్మాణానికి ఆయన స్థానిక శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. గతంలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు విశ్రాంతం ఉద్యోగుల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ భవన నిర్మాణాన్ని త్వర తగతిన పూర్తి చేసి ఉద్యోగులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హామీ మేరకు 6 నెలల్లోనే విశ్రాంత ఉద్యోగుల కోసం కార్యాలయం ఏర్పాటుకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ శంకుస్థాపనతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, నాయకులు ధనరాజ్ గౌడ్, మంగమ్మ శివకుమార్, మాజీ కౌన్సిలర్ లు, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుల సంఘాలకు అండగా ఉంటా

**ధర్మారం, నవభూమి :** కుల సంఘాలకు అండగా ఉంటానని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హామీ ఇచ్చారు. సోమ వారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీతో పాటు మేడారంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ నెల రోజుల వ్యవధిలో బొమ్మరెడ్డిపల్లి, చామనపల్లిలో 150కి పైగా గొర్రెలు ప్రమాదంలో చనిపోవడం బాధాకరమని మంత్రి అన్నారు. యాదవ కుటుంబాలకు 8 లక్షల 70 వేల ఆర్థిక సహాయం త్వరగా అందించామని తెలిపారు. యాదవ, కుర్మ, గౌడ, మూన్నూరు కాపుల కు కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు కృషి చేస్తానని, వీలైనంత త్వరగా స్థల పరి శీలన చేసుకోవాలని సూచించారు. ఎర్రగుంటపల్లిలో ఐటీఐ కళాశాల నిర్మిస్తా మని తెలిపారు. కలెక్టర్ మట్లాడుతూ 15 రోజల క్రితం గొర్రెలు చనిపోగా మంత్రితో కలిసి నష్టపరిహారం విషయంలో యాదవ కుటుంబాలకు ప్రభు త్వం తరుపున ఆదుకుంటామని హామీ ఇచ్చామని తెలిపారు. బొమ్మరెడ్డిపల్లిలో 5గురు లబ్ధిదారులకు 5లక్షల10 వేలు, చామనపల్లిలో 9 మందికి 3 లక్షల 64 వేల చెక్కులు పంపిణీ చేస్తున్నామన్నారు. చామనపల్లిలో ఓ పేద కుటుంబం ఇల్లు కాలిపోయిన ఘటన మంత్రి దృషికి రాగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశామని, మండల వ్యాప్తంగా 6 వందల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. బీఆర్ఎస్ అవినీతిపై కేంద్రం ఎందుకు జోక్యం చేసుకోలేదు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పదేళ్ళ అవినీతి పాలన చేసిన బీఆర్ ఎస్ పార్టీపై ఎందుకు విచారణ జరిపించలేదని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రశ్నించారు. పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ పార్టీ వేల కోట్ల అవినీతికి పాల్పడినా, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీ యాంశంగా మారినా కేంద్ర మంత్రి అమిత్‌షా ఎందుకు విచారణకు ఆదేశిం చలేదో సమాధానం చెప్పాలన్నారు. ఈడీలు, సీబీఐలు మీ చేతుల్లో ఉన్నా బీఆర్ఎస్ పార్టీ అవినీతిపై ఎప్పుడు బీజేపీ ప్రశ్నించలేదన్నారు. చట్టసభల్లో బీజేపీకి బీఆర్ఎస్ పార్టీ మద్దతు చెబుతుందని, బీఆర్ఎస్ బీజేపీకి డీఎన్ఏ పార్టీ అయినందునే పదేండ్లు అవినీతికి పాల్పడిన బీజేపీ పెద్దలు చూసీచూడ నట్లు వ్యవహరించారని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ నేతృతంలో పేదల కోసం ముఖ్యమంత్రి చేస్తున్న సంక్షేమ పథకాలు బీజేపీ పెద్దలకు కనబడడం లేదా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లాలని మాట్లాడిన మాటలే తప్ప ఆయన మాటల్లో చిత్తశుద్ధి లేదన్నారు. కేంద్రానికి దమ్ముంటే అవినీతికి పాల్పడి రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిన కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులపై ఇప్పటికైనా విచా రణ జరిపించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పనులు ప్రారంభం మేడారంలో పలు అభివృద్ధి పనులను కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు. గ్రామంలో 261 విద్యుత్ పోల్స్ తరలింపునకు రూ. 26 లక్షలు, లూజ్ వైర్ మర మ్మతులకు రూ. 14 లక్షలు, అంతర్గత సీసీ రోడ్ల కోసం 8 లక్షల రూపాయలు కేటాయించినట్లు మంత్రి తెలి పారు. మేడారం కోర్టు నుంచి కటికెనపల్లి వర కు సీసీ రోడ్డు పనులు నెల రోజుల్లో ప్రారం భిస్తామన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్య క్రమం కింద బస్సులు కొనుగోలు చేసి ఆర్టీ సీకి అద్దెకిచ్చి మహిళలు ఆదాయం సమకూ ర్చడం హర్షనీయమన్నారు. అనంతరం 42 స్వశక్తి సంఘాల మహిళలకు బ్యాంక్ లింకేజి ద్వారా ఐదు కోట్ల తొమ్మిది లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఆర్‌డీఓ బి.గంగయ్య, పీడీ హౌసింగ్ రాజేశ్వర్‌రావు, ఏఎంసీ చైర్మెన్ లావుడ్య రూప్లానాయక్, వైస్ చైర్మెన్ అరిగె లింగయ్య, మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, డీటి ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు మండల దివ్యాంగులు వినతిపత్రం అందజేశారు. ఇం దిరమ్మ ఇండ్లు మంజూరుతోపాటు ట్రై సైకి ళ్లు, మొబైల్ ఆటోలు, 5జీ ఫోన్స్ మంజూరు చేయాలని కోరారు. సెకండ్ ఏఎన్ఎంలు వినతి పత్రం అందజేశారు.



## డాక్టర్స్ డే సందర్భంగా డాక్టర్ వినయ్ ఉప్రేకు సన్మానం



**వాంకిడి, జూలై 1 నవభూమి న్యూస్** జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా వాంకిడి ప్రభుత్వ దవాఖానలో సేవలందిస్తున్న ప్రముఖ వైద్యులు డాక్టర్ వినయ్ ఉప్రేను ఘనంగా సన్మానించారు. భారతీయ బౌద్ధ మహాసభ, అంబేద్కర్ సంఘం, సిద్ధార్థ యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన సేవలను కొనియాడుతూ శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా మహాసభ జిల్లా అధ్యక్షులు అశోక్ మహుల్కర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న డాక్టర్ వినయ్ ఉప్రే నిజమైన ప్రజా సేవకుడని అన్నారు. కార్యక్రమంలో మండల భారతీయ బౌద్ధ మహాసభ నాయకుడు పాండుజి, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు దుర్గం దుర్గాజీ, ప్రధాన కార్యదర్శి ఉప్రే విజయ్, గౌరవ అధ్యక్షులు జయరాం ఉప్రే, సమతా సైనిక్ దళ్ జిల్లా బాధ్యులు దుర్గం సందీప్, సమాజ అధ్యక్షులు రాజేశ్వర్, బౌద్ధ ఉపాసకులు, వర్షవాస్ అధ్యక్షులు పాండుజి తదితరులు పాల్గొన్నారు.

## వడ్డీ వ్యాపారం చేసి చీట్ చేసిన నలుగురి అరెస్టు

**టూ టౌన్ ఇన్స్పెక్టర్ సోమనరసయ్య**



**మిర్యాలగూడ నవభూమి, జూలై 1:-** రిజిస్ట్రేషన్ లేని, అక్రమ చిట్ ఫండ్, వడ్డీ వ్యాపారం చేస్తు ప్రజల సొమ్ము ఇవ్వకుండా మోసం చేసి ఉడాయించిన నలుగురీ ముఠాను అరెస్టు చేసినట్టు మిర్యాలగూడ టూ టౌన్ పోలీస్ ఇన్స్పెక్టర్ జెట్టి సోమనర్సయ్య తెలిపారు. మంగళవారం స్థానిక టూ టౌన్ పోలీసు స్టేషన్ లో జరిగిన విలేఖరుల సమావేశంలో నిందితులు నలుగురిని ప్రవేశ పెట్టి మాట్లాడుతూ దామరచర్ల మండలం బొత్తలపాలెం గ్రామానికి చెందిన కటకం సైదిరెడ్డి శాంతినగర్ లో నివాసం ఉంటూ శాంతినగర్, సంతోష్ నగర్, రెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లోనీ చిట్ ఫండ్ లో చేర్పించి లక్ష నుండి 5లక్షల విలువైన చిట్టిలలో సభ్యులుగా చేర్చుకున్నాడన్నారన్నారు. చిట్టి డబ్బులతో బియ్యం వ్యాపారం? వడ్డీ వ్యాపారం చేస్తూ సైదిరెడ్డి, కటకం వెంకట్ రెడ్డి, మామిల్ల వెంకన్న, గుణగంటి జానయ్యలు సభ్యులను, వడ్డీకి డబ్బు ఇచ్చిన వారిని తిరిగి డబ్బు ఇవ్వకుండా ఐపి పెట్టుకున్నారు. సుమారు కోటి రూపాయల వరకు చెల్లించకుండా చేతులెత్తేయడంతో బాధితులు తమకు ఫిర్యాదు చేశారనీ తెలిపారు. దీంతో కేసు నమోదు చేసి శ్రీమన్నారాయణ ఫంక్షన్ హాలు వెనుక అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురీని నిందితులను అరెస్టు చేసి స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచినట్లు ఆయన తెలిపారు. చాకచక్యంగా పట్టుకున్నందుకు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, మిర్యాలగూడ డిఎస్పీ రాజశేఖర్ రాజు అభినందించారు. సమావేశంలో ఎస్ఐలు బి.రాంబాబు, హరీష్ రెడ్డిలున్నారు.

## వాసవి క్లబ్ రీజియన్ 2 ఆధ్వర్యంలో ఘనంగా చార్టర్ అకౌంటెంట్ డే



**మిర్యాలగూడ నవభూమి, జూలై 1:-** వాసవి క్లబ్ రీజియన్ 2 ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా చార్టర్ అకౌంటెంట్ డే వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని చార్టర్ అకౌంటెంట్లను శాలువాలతో ఘనంగా సత్కరించి సేవలను ప్రశంసించారు. చార్టర్ అకౌంటెంట్ సంతోష్, నవ్య , మురళీకృష్ణ, నరేందర్‌లను సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్సి నకిరేకంటి సత్యనారాయణ, ఐపిసిలు డైమండ్ మాశెట్టి శ్రీనివాస్, మిట్టపల్లి విజయభాస్కరరావు, డిస్టిక్ ఇంచార్జ్ సామ శ్రీనివాస్, జడ్. సి. గట్టు వెంకటేశ్వర్లు, డైమండ్ క్లబ్ మిర్యాలగూడ ప్రెసిడెంట్ పాంపాటి రామలింగయ్య, ట్రెజరర్ కొండూరు పరమేశ్వర్, జస్టిస్ అడ్వకేట్స్ క్లబ్ ప్రెసిడెంట్ సోమ దిలీప్, వనితకు వందనం మిర్యాలగూడ ప్రెసిడెంట్ మందాలపు బాలమణి పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ డిస్టిక్ రీజియన్-2 ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్స్ డే

**మిర్యాలగూడ నవభూమి, జులై 1:-** మిర్యాలగూడ పట్టణంలోని వాసవి క్లబ్ డిస్టిక్ రీజియన్-2 ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్స్ డే ఘనంగా నిర్వహించారు. మెరుగైన వైద్య సేవలు అందించిన డాక్టర్లు చిలుకల ఉజ్వల, సి.రవికుమార్, గౌరు నవీన్, వాసవి, సతీష్, ఓరుగంటి శ్రీవిద్య, నాగేశ్వరరావు, రివర్ హాస్పటల్ డాక్టర్స్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి గొట్టిముక్కల. అవినాష్ సుబ్బారెడ్డి. ఒంగోలు పోతిరెడ్డి . రామంత రెడ్డి మట్ట రాకేష్ లను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్.సి. నకిరెకంటి సత్యనారాయణ ఐపిసిలు డైమండ్ మాశెట్టి శ్రీనివాస్, మిట్టపల్లి విజయభాస్కరరావు, డిస్టిక్ ఇంచార్జ్ సామా శ్రీనివాస్, జడ్ సి గట్టు వెంకటేశ్వర్లు, డైమండ్ క్లబ్ మిర్యాలగూడ ప్రెసిడెంట్ పాంపాటి రామలింగయ్య, ట్రెజరర్ కొండూరు పరమేశ్వర్, జస్టిస్ అడ్వకేట్స్ క్లబ్ ప్రెసిడెంట్ సోమ దిలీప్, వనితకు వందనం ప్రెసిడెంట్ మందాలపు బాలమణి పాల్గొన్నారు.

